ప్రజాశక్తి
శుక్రవారం 15 మార్చి 2024
5
విజయనగరం



పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎఎస్‌పి

ప్రజాశక్తి-గజపతినగరం రూరల్

జిల్లాఎస్‌పి ఎం.దీపిక ఆదేశాలతో గురువారం అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్ మండలంలోని రామన్నపేట, లోగిశ, కెంగువ, గజపతినగరం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను, మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పర్యవేక్షించి, అధికారులకు పలు భద్రతపరమైన సూచనలు చేశారు. ఆమె వెంట ఎస్ఐ మహేష్ ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టిన భద్రత ఏర్పాట్లను ఎఎస్‌పికి వివరించారు.



రామన్నపేట పోలింగ్ కేంద్రాన్నిపరిశీలిస్తున్న ఎఎస్‌పి



బొబ్బిలిలో నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు



కొత్తవలసలో నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

బిజెపి రైతు,కార్మిక వ్యతిరేక విధానాలపై

రైతు, కార్మిక సంఘాల నిరసన

ఢిల్లీలో రైతుల సభకు మద్దతుగా ర్యాలీలు

ప్రజాశక్తి-బొబ్బిలి

దేశంలో బిజెపి అమలు చేస్తున్న రైతు,కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరుగుతున్న భారీ బహిరంగ సభకు మద్దతుగా అఖిలపక్ష రైతు కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోపలుచోట్ల నిరసన తెలిపారు. ఢిల్లీలో రైతుల బహిరంగ సభకు మద్దతుగా ర్యాలీలు చేశారు.

బొబ్బిలిలో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు .కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, పట్టణ కళాసీ సంఘం కార్యదర్శి డి.వర్మ, ఎఐటియుసి నాయకులు ఎం.శ్రీనివాస్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, ఇఫ్టూ నాయకులు వి.రామ్మూర్తి డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు పి.లక్ష్మణరావు, సురేష్, మణికుమార్, వి.శేషగిరిరావు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంటౌన్ : అఖిలపక్ష రైతు కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కోట జంక్షన్ ఎన్టీఆర్ విగ్రహం నుంచి సింహాచలం మేడ వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడారు.కార్యక్రమంలో సిఐటియు నగరకార్యదర్శి రమణ, నాయకులు త్రినాథ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్, నాయకులు సౌమ్య, రవి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు హరీష్, సతీష్ పాల్గొన్నారు.

గజపతినగరం : రైతు సంఘాల కిసాన్‌మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన చినచామలాపల్లిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడారు. రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ఇవ్వకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రధాని మోడీ రైతులను మోసం చేశారన్నారు. స్వామినాథన్ చెప్పినట్లు మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లుకు వెనక్కి తీసుకోవాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, విద్యుత్ సవరణ బిల్లు, 4 లేబర్ కోడ్‌ల రద్దుకు రైతులు,కార్మికులు చేస్తున్న పోరాటాలను బలపరచాలని విజ్ఞప్తి చేశారు. కోసం ప్రజానీకం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉన్నదని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, చిన చామలాపల్లి గ్రామ రైతులు, కూలీలు, వత్తిదారులు పాల్గొన్నారు.

కొత్తవలస : ఢిల్లీలో జరుగుతున్న భారీ బహిరంగ సభకు మద్దతుగా అఖిలపక్ష రైతు కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు గాడి అప్పారావు మాట్లాడారు. కార్యక్రమంలో ముఠా కార్మికులు, ఆటో కార్మికులు, ఉపాధి హామీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గరివిడి: అఖిలపక్ష రైతు కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిటికి వినతి పత్రాన్ని అందజేశారు. సిఐటియు మండల డివిజన్ కార్యదర్శి అంబాల్ల గౌరి నాయుడు, గంటేడ అప్పలరాజు, వి. ప్రకాష్, తాళ్లపూడి సాంబశివ, పిసిని చిన్నప్పల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి : ఉణుకూరు , అంబాడ వెంకటాపురంలో రైతు సంఘం సిఐటియు ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. ఉణుకూరులో రాస్తా రోకో చేశారు. సిఐటియు, రైతు సంఘం నాయకులు వంజరాపు తిరుపతి, పోరెడ్డి విశ్వనాధం, దుబా కమల్నాయుడు, ఎం. అసిరినాయుడు, కడగళ్ల గురునాయుడు, బలరాం నాయుడు, తదితరు పాల్గొన్నారు.

భోగాపురం : కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పూసపాటిరేగ, భోగాపురంలో సిఐటియు నాయకులు బి. సూర్యనారాయణ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. రమణ,అప్పారావు, దాసు, రవి, రామసూరి తదితరురలు పాల్గొన్నారు.



చిన చామలాపల్లిలో మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ



పూసపాటిరేగలో నిరసన తెలుపుతున్న కార్మికులు



ఆ మూడుచోట్లా ఉత్కంఠ

- చీపురుపల్లి, ఎస్.కోట, పాలకొండలో ఖరారు కాని అభ్యర్థుల పేర్లు
- ఆశా వాహుల్లో తీవ్ర నిరాశ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

చీపురుపల్లిలో సీనియర్‌ను రంగంలోకి దింపేందుకు స్థానిక యువ నాయకుడ్ని పక్కనబెట్టేందుకు ప్రయత్నాలు. ఎస్.కోటలో యువ నాయకుడి కోసం సీనియర్‌ను పక్కనబెట్టే ఆలోచన. అటు మన్యం జిల్లా పాలకొండలో గెలుపు గుర్రం కోసం వెతుకులాట. దీంతో, ఈ మూడు నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులు ఎవరో అంటూ ఆసక్తికరమైన చర్చనడుస్తోంది. అటు టిడిపి శ్రేణుల్లోనూ ఉత్కంఠ నెలకొంది. టిడిపి అధిష్టానం విడుదల చేసిన మొదటి జాబితాలో ఉమ్మడి జిల్లాలోని 11 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను చీపురుపల్లి, ఎస్.కోట, పాలకొండ మినహా మిగిలిన 8స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. గురువారం ప్రకటించిన రెండవ జాబితాలోనూ ఈ నియోజకవర్గాల అభ్యర్థుల ప్రస్తావన లేకపోవడంతో ముఖ్యంగా టిడిపి శ్రేణులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. చీపురుపల్లిలో వైసిపి సీనియర్ నేత, విద్యాశాఖ మంత్రి బొత్స సత్య నారాయణను ఢీకొట్టే పేరుతో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును రంగంలోకి దింపేయోచనలో టిడిపి అధిష్టానం ఉన్న విషయం విధితమే. గంటాను అధిష్టానం ఆదేశించి సుమారు 25రోజులు కావస్తున్నప్పటికీ ఆయన తన నిర్ణయాన్ని బహిర్గతం చేయలేదు. దీంతో, రెండో జాబితాలో కూడా చీపురుపల్లి నుంచి ఎవరు రంగంలోకి దిగుతారనేది ఇంకా తేలలేదు. ఇదే అదునుగా ఆ నియోజకవర్గం నుంచి పోటీకి దిగనున్న మంత్రి ప్రచారంలో తనదైన శైలి ప్రదర్శిస్తున్నారు. దాదాపు వారానికి నాలుగు రోజులు నియోజకవర్గంలోనే పర్యటిస్తూ తన బలాన్ని పెంచుకునే పనిలో నిమగ్న మయ్యారు. టిడిపి ఇంకా అభ్యర్థిని ఖరారు చేయకపోవడంతో ఈలోపు జరగాల్సిన నష్టం జరిగిపోతుందంటూ టిడిపి శ్రేణులు ఆవేదన వ్యక్తం చేసే పరిస్థితి నెలకుంది. మరోవైపు చీపురుపల్లి నుంచి సీటు ఆశీస్తూ ఇన్నాళ్లూ పార్టీని నడిపించిన స్థానిక పార్టీ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున మరికొన్ని రోజులు ఎదురు చూపులు తప్పని దుస్థితి ఏర్పడింది. ఎస్.కోటలో సీనియర్ ఎమ్మెల్యే, కోళ్ల లలిత కుమారి కూడా సీటు కోసం నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది. పార్టీలో ఈసారి చాలా చోట్ల యువతను ప్రోత్సహించే లక్ష్యంతో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ పేరును పరిశీలిస్తుండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. అటు పాలకొండ లోనూ నియోజకవర్గ ఇన్‌ఛార్జికి ప్రత్యామ్నాయం చూస్తున్నట్టుగా చర్చ నడుస్తోంది. దీనికితోడు ఆశావహులు ఎక్కువగా ఉండడం వల్ల అధిష్టానం గెలుపు గుర్రాన్ని గుర్తించలేక పోతుంది. ఈనేపథ్యం లో ఈ మూడు నియోజక వర్గాల్లోనూ ఇన్‌ఛార్జులను పక్కనబెట్టే యోచనలో ఉన్నట్టుగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో, ఈ మూడుచోట్ల ఉత్కంఠ భరితమైన చర్చ సాగుతోంది. ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది.

మంచి చేసే వారికే పట్టం కట్టండి : బొత్స

ప్రజాశక్తి - వీరఘట్టం, వంగర

ప్రజలకు మంచి చేసే వారికి రానున్న ఎన్నికల్లో పట్టం కట్టాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రజలను కోరారు. మండలంలోని కిమ్మిలో సచివాలయం, రైతు భరోసా కేంద్రంతో పాటు రూ.27.5 కోట్లతో నిర్మించిన వంతెనను పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మ ఒడి, రైతు భరోసా, చేయూత, విద్యాదీవెన, జగనన్న విద్యా కానుక, ఇళ్ల స్థలాలు, గృహాలు మంజూరు వంటి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. . సచివాలయానికి 35 మంది ఉద్యోగులను నియమించి అన్ని రకాల సేవలందిస్తున్నట్లు చెప్పారు. రానున్న కాలంలో పథకాలన్నీ రావాలంటే ఇక్కడ ఎమ్మెల్యే కళావతిని, ఎంపీగా భాగ్యలక్ష్మిని గెలిపించాలన్నారు. నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి కిమ్మి వంతెనకు అనుమతులిస్తే ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి పాలనలో వంతెను ప్రారంభించడం సంతోషకర మన్నారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు. ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ వంతెన ప్రారంభించడం వల్ల అటు రాజాం, ఇటు పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలాల ప్రజల రాకపోకలకు అనువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.రామ్మోహన రావు, ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, జడ్‌పిటిసి జంపు కన్నతల్లి, సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి, పాలకొండ ఎఎంసి ఉపాధ్యక్షులు పి.లక్ష్మణరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి గోవిందరావు, ఎంఎఇసి చైర్మన్ కర్రి లీలాప్రసాద్, హౌసింగ్ బోర్డు డైరెక్టర్ భోగి లతా మాణిక్య చంద్రశేఖర్, పిఎసిఎస్ డైరెక్టర్ రంభ శ్రీనివాసరావు, ఎఎంసి డైరెక్టర్ కె.ఆంజనేయులు, వంగర ఎంపిపి ముఖర్జీ, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వంతెనను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

5,546 మందికి ఇబిసి నేస్తం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన 5,546 మందికి మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి గురువారం రూ.831.90 లక్షలను విడుదల చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లె లో జరిగిన ఈ కార్యక్రమంలో, ముఖ్యమంత్రి జగన్ మోహన రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసిన అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి లబ్ధిదారులకు ఈ మొత్తానికి సంభందించిన చెక్కును అందజేశారు. రెడ్డి, కమ్మ, క్షత్రియ, బ్రాహ్మణ, వెలమ ఇతర ఒసి కులాలకు చెందిన 45-60 సంవత్సరాల పేద మహిళల ఆర్థికాభివృద్ధికి, సాధికారతకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఏటా రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. దీనికింద 2021-22 సంవత్సరంలో 4,972 మందికి రూ.745.80 లక్షలు, 2022-23 లో 5,738 మందికి రూ.860.70 లక్షలు అందజేశారు. ఈ ఏడాదికి గాను 5,546 మందికి రూ.831.90 లక్షలను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితో బాటు, జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఇడి పెంటోజిరావు, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కరరావు, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.




చెక్కు అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

అలజంగిలో విషాదం

ప్రజాశక్తి-బొబ్బిలి

పదో తరగతి పరీక్షలకు బాగా చదవాలని తల్లిదండ్రులు మందలిం చడంతో మనస్థాపం చెందిన విద్యార్థిని గెద్ద మానస ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన మానస పదో తరగతి చదువుతుంది. పరీక్షలు దగ్గర పడడంతో బాగా చదవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన బాలిక బుధవారం రాత్రి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తెల్లవారి నిద్రలేచిసరికి కుమార్తె విగతజీవిగా వేలాడుతూ కనిపించడంతో తల్లిదండ్రులు అరుణకుమారి, శంకరరావు బోరున విలపించారు. మానసకు తమ్ముడు ఆదర్శ్ ఉన్నాడు. విద్యార్థిని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఎన్నికల వేళ ప్రారంభోత్సవాల జోరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నికల సమీపిస్తున్న వేళ నగరంలో ఎమ్మెల్యేకోలగట్ల వీరభద్రస్వామి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు ఊపందు కున్నాయి. గురువారం బాలాజీ నగర్ బ్యాంక్ కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను, రూ. 1.50కోట్లతో ఆధునికీరించిన నెహ్రూ పార్కును, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. ప్రత్యేకం గా పిల్లలకోసం పార్కును ఏర్పాటు చేయడం ఎక్కడా లేదన్నారు. మేయర్ విజయలక్ష్మి, బాలి ప్రతాప్, వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా కోఆర్డినేటర్ జి కష్ణంరాజు, బాలాజీ వాకర్స్‌క్లబ్ కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు. స్థానిక మయూరి ఎత్తు బ్రిడ్జి డౌన్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్‌ను కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. బస్సు ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేందుకు ఆధునిక వసతులతో ఈ షెల్టర్ ప్రారంభించా మన్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జులు బొద్దాన అప్పారావు, మారం బాల బ్రహ్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జివి రంగారావు, వైసిపి నాయకులు భోగాపురపు రవిచంద్ర, బాలి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. అయ్యకోనేరు దక్షిణ గట్టు ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన కళావేదికను కోలగట్ల ప్రారంభించారు. నేటి నుండి కళాకారులు తమ కళను ప్రదర్శించాలన్న ఔత్సాహికులు ఆదిభట్ల కళావేదికను వినియోగించు కోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కెవిపి రాజు, బుచ్చిరాజు, మండపాకరవి తదితరులు పాల్గొన్నారు.

కోలగట్ల ను గెలిపించుకుంటాం

రానున్న ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచి, కోలగట్ల వీరభద్రస్వామిని మరోసారి గెలిపించు కుంటామని నాయీ బ్రాహ్మణ సంఘం తీర్మానించింది. కంటోన్మెంట్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామేశ్వరపు రామారావు మాట్లాడారు. జోనల్‌ఇన్‌ఛార్జుల కోలగట్ల తమ్మన్న శెట్టి, డాక్టర్ వి ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



విద్యుత్తు కాంతులతో నెహ్రూ పార్కు



పతకాలు సాధించిన ఎఆర్ కానిస్టేబుళ్లను అభినందిస్తున్న ఎస్‌పి దీపిక

పతకాలు సాధించిన ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఇటీవల థాయిలాండ్ లో జరిగిన 28వ థాయిలాండ్ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పోల్వాల్ట్ విభాగంలో బంగారు పతకం సాధించిన ఎఆర్ కానిస్టేబులు పి.సన్యాసి నాయుడు, 5 కిలోమీటర్ల వాకింగ్ విభాగంలో వెండి పతకం సాధించిన ఎఆర్ కానిస్టేబులు మజ్జి మహేశ్వరరావు, మహారాష్ట్రలో జరిగిన జాతీయస్థాయి పోలీసు మీట్‌లో యోగా విభాగంలో బంగారు పతకం సాధించిన ఎం. దుర్గా ప్రసాద్‌లను ఎస్‌పి ఎం.దీపిక అభినందించారు. మహారాష్ట్ర నాగపూర్‌లో జరిగిన జాతీయస్థాయి పోలీసు యోగా మీట్ లో పాల్గొన్న ఎఆర్ కానిస్టేబులు ఎం.దుర్గా ప్రసాద్ బంగారు పతకం సాధించారు. ఒక గంట 30 నిమిషాల వ్యవధిలో 216 సెట్స్ సూర్య నమస్కారం ఆసనాలు వేసి, యోగాసనాల్లో బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నెలకొల్పి, మరో బంగారు పతకంను సాధించారు. ఈనేపథ్యంలో క్రీడలు, యోగాలో చూపిన ప్రతిభను కొనియాడి, జిఎస్ఇ (గుడ్ సర్వీసు ఎంట్రీ)లను ప్రకటించారు.

ఐవిఎఫ్ సెంటర్లు తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా కేంద్రంలోని లండన్ ఐవిఎఫ్‌సెంటర్‌ను ఎఆర్‌టి తనికీ సభ్యులతో కలిసి డిఎంహెచ్ఒ భాస్కరరావు గురువారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ ఆర్. సుజాత , రేడియోలాజిస్ట్ ఎల్‌వివి ప్రసాద్, పేథాలజిస్ట్ భానుమిత్ర దాస్ , నేచర్ ఎన్‌జిఒ జికె దుర్గా , డెమో వి. చిన్నతల్లి , ఎం. చాముండేశ్వరి హెల్త్ ఎడ్యుకేటర్ మోనిటరింగ్ కన్సల్టెంట్ ఎ. పవన్ ఆశిష్ పాల్గొన్నారు.

జియోకెమిస్ట్రీ రంగంలో ఉద్యోగ అవకాశాలు మెండు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భూవిజ్ఞాన, రసాయనిక శాస్త్రాల పై పరిశోధన చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టివి కట్టిమని అన్నారు. యూనివర్సిటీలో గురువారం 'వికసిత భారత్ 2047 - ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ జియో కెమిస్ట్రీ అండ్ జియో కెమికల్ ఎనాలిసిస్' అనే అంశాలపై వర్కుషాప్ జరిగింది. ముఖ్య అతిథి గా విచ్చేసిన హైదరాబాద్ ఎన్‌జిఆర్ఐ విశ్రాంత ఎమిరిటస్ సైంటిస్ట్ డాక్టర్ వి బలరాం మాట్లాడుతూ భూ విజ్ఞానశాస్త్రంలో ముఖ్య భాగమైన జియో కెమికల్ సైన్స్ విద్యార్థులకు, పరిశోధకులకు, పర్యావరణ ప్రేమికులకు భూరసాయనిక శాస్త్ర అధ్యాపకులు ఎదుర్కొనే ఎన్నో సమస్యలకు సమాధానం చెపుతుందని అన్నారు. కార్యక్రమంలో జియాలజీ విభాగ సహాయ అధ్యాపకుడు ప్రతిష్టాత్మక స్ప్రింగర్ పబ్లికేషన్ ద్వారా సంకలనం చేసి ప్రచురించిన 'ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ వాటర్ సప్లై కన్సర్వేషన్ అండ్ మేనేజ్‌మెంట్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సెమినార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సివిల్ ఇంజినీరింగ్ ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని జె ఎన్ టి యు రిజిస్ట్రార్ జి.జయసుమ అన్నారు. రెండు రోజులు పాటు సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో జరిగిన సెమినార్ గురువారం ముగిసింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్ ద్వారా మంచి అవకాశాలు ఉన్నాయి వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సెమినార్లలో వివిధ అంశాల్లో ప్రతిభచూపిన విద్యార్దులను అభినందించారు. సెమినార్‌లో అధ్యాపకులు,విద్యార్దులు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ వెలువడిన రోజు నుండే మోడల్ కోడ్ అమలు

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని విజయనగరం నియోజకవర్గం ఆర్ఒ జేసీ కె.కార్తీక్ తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం నియోజకవర్గ స్థాయి ఎన్నికల అధికారులు సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎన్నికల విధులు, మోడల్ కోడ్ తదితర అంశాల పై ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలను చదవాలన్నారు. ఎంసిసి బృందాలు ఎన్నికల ఫిర్యాదులపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. స్టాటిక్ సర్వేలన్స్ బృదాలు ఇతర ఎన్నికల సిబ్బంది ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల విధులు మాత్రమే నిర్వహించాలని స్పష్టం చేశారు. అధికారులంతా ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎఇఆర్ఒలు రత్నం, విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ మల్లయ్య నాయుడు నియోజక వర్గానికి కేటాయించిన ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మీ కోసమే పనిచేస్తా : కొండపల్లి

ప్రజాశక్తి-గంట్యాడ

అందరూ కలిసి ఉమ్మడిగా గెలిపిస్తే మీ కోసమే పని చేస్తానని గజపతినగరం నియోజకవర్గం తెలుగుదేశం అభ్యర్థి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. గురువారం గంట్యాడలో జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. తనతాత కొండపల్లి పైడితల్లి నాయుడు పేరు నిలబెడతానని, ఆయన అడుగుజాడలో నడుస్తానని అన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వాలని అన్నారు. నిరుద్యోగులకు మూడు వేల రూపాయలు నిరుద్యోగ భృతిని అందిస్తామన్నారు. చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న కొండపల్లి అప్పలనాయుడు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, ఆయన మాట మీద నడుచుకుంటూ నియోజవర్గాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. నియోజకవర్గంలో టిడిపి, జనసేన కార్యకర్తలు ఏకతాటిపైకి వచ్చి తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, జనసేన నాయకులు ఎం సురేష్,పడాల అరుణ పాల్గొన్నారు.

టిడిపితోనే మా కలలు సాధ్యం

ప్రజాశక్తి-విజయనగరం కోట

మా మహిళల కలలు టిడిపితోనే సాధ్యమవుతాయని తెలుగు మహిళా నాయకులు అన్నారు. తెలుగు మహిళా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం 37, 38, 39 డివిజన్‌లలో డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ టిడిపిని స్థాపించిన తరువాతే మహిళలకు గుర్తింపు వచ్చిందని, మహిళలకు ఆస్తిలో సమానహక్కు కల్పించారన్నారు, చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించడం, తరువాత నారా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మొట్టమొదటిసారిగా డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు, వైసిపి పాలనలో మహిళలపై అత్యాచారాలు, దాడులు వంటివి విపరీతంగా పెరిగాయని, మహిళలకు రక్షణ కల్పించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ నేపథ్యంలో అదితి విజయలక్ష్మి గజపతికి తామంతా మద్దతు తెలుపుతున్నామని తెలిపారు. నాయకులు సువ్వారి అనురాధ బేగం, పత్తిగుళ్ల సూర్యకుమారి, కంది శమంతకమణి, రాజ్యలక్ష్మి, పద్మలత, చింతల వీరలక్ష్మీ, సియ్యాదుల ఝాన్సీ పాల్గొన్నారు.



టిడిపి మద్దతు తెలుపుతున్న డ్వాక్రా మహిళలు

మెరుగైన సేవలందించేందుకు కృషి

విజయనగరం టౌన్ : నగర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని మేయర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో పొందుపరిచిన అంశాలకు ఆమోదం లభించింది ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు త్వరితగతిన చేయాలని చెప్పారు. సమావేశంలో కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు,స్టాండింగ్ కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, పిన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

విజయనగరం కోట : త్వరలో రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రూరల్‌సిఐ ఎం.శ్రీనివాసరావు కోరారు. గురువారం విటి అగ్రహారం బిసి కాలనీలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎస్ఐలు ఆర్.వాసుదేవ్, శ్యామల పలువురు కానిస్టేబుళ్ల పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

సూపర్ సిక్స్ పథకాలతోనే భవిష్యత్తు

శృంగవరపుకోట: టిడిపి, జనసేన సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికి భవిష్యత్ గ్యారంటీ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. పట్టణంలోని శ్రీనివాస కాలనీలో బుధవారం క్లస్టర్ ఇంచార్జ్ కాపుగంటి వాసు,పెదగాడ లక్ష్మి, గుడుపు నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన శంఖారావం బాబు సూపర్ సిక్స్ కార్యక్రమంలో కోళ్ల లలిత కుమారి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి పాల్గొని మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ప్రజలందరికి బాబు సూపర్ సిక్స్ క్యాలెండర్ ఇచ్చి, అక్కడ ప్రజలకు, రైతులకు చంద్రన్న ప్రభుత్వం వస్తే మరింత సంక్షేమాన్ని అందుతాయని, అన్ని బడుగుబలహీన వర్గాల వారందరికి మేలు జరుగుతుందని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, పట్టణ అధ్యక్షుడు మళ్లీశ్వరావు, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ, ఎస్.కోట సర్పంచ్ సంతోషి కుమారి, బిఖిల్ల అరుణ, వాకాడ బాబు, చక్క కిరణ్, పొట్నూరు అప్పలరాజు, జనసేన, నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

డెంకాడ: ఎపిసిఐఐ, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, భారత ప్రభుత్వం సంయుక్తంగా 'మేరా పెహ్లా ఓటు దేశ్ కే లియే' ప్రచార కార్యక్రమాన్ని స్థానిక ఎంవిజిఆర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ క్యాంపస్‌లో గురువారం చేపట్టింది. ఇందులో భాగంగా తొలిసారి ఓటు వేయనున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంవిజిఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.ఎస్.సీతారామరాజు మాట్లాడుతూ ఓటును అమ్ముకోవడం మీ ఆత్మగౌరవాన్ని అమ్ముకోవడం, మీ భవిష్యత్తును అమ్ముకోవడం లాంటిదని ప్రతి ఒక్కరూ మంచికి ఓటు వేయాలని చెప్పారు. యువత దీర్ఘకాల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే వ్యక్తులకు ఓటు వేయాలని సూచించారు. అనంతరం 'ఓటు దేశ్ కే లియే' అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మోహన్ కుమార్, అనిల్ ప్రకాష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

చీపురుపల్లి: మండలంలోని అలజంగి పంచాయతీ ఆర్డీపలస గ్రామంలో సుమారు రూ.15 లక్షలతో రోడ్డు పనులకు జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష గురువారం శంకుస్థాపన చేశారు. జెడ్‌పిటిసి నిధులతో కరకాం పంచాయతీ సంకుపాలెంలో గల ప్రాథమిక పాఠశాలలో బోరు బావి ఏర్పాటు చేశారు. చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని 3, 4, 5 సచివాలయాలలో పాటు గచ్చులవలస గ్రామంలో లబ్ధిదారులకు జగనన్న ఇళ్లలో భాగంగా రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఇప్పిలి అనంతం, వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్‌పిటిసి మీసాల వరహాలనాయుడు, ఎఎంసి చైర్మన్ ధన్నాన జనార్దన, జిల్లా యువజన ఉపాధ్యక్షులు బెల్లాన వంశీకృష్ణ, సర్పంచ్ రఘుమండ త్రినాధ్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు రేవల్ల సత్తిబాబు, వైసిపి నాయకులు ముక్కు పైడిరాజు, ఇప్పిలి తిరుమల, భీశెట్టి రవి, మహాలక్ష్మి నాయుడు, ముక్కు ఈశ్వరావు, దీసుపల్లి రాము, శిష్టూ, శ్రీహరి, పాల్గొన్నారు.

వేలకు రారు.. వైద్యం చేయరు..

లక్కవరపుకోట: మండలంలోని భీమాలి సచివాలయం వద్ద ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సమయానికి తెరవరు సరికదా వైద్యం కూడా అంతంత మాత్రమేనని పలువురు విమర్శిస్తున్నారు. గురువారం పాత్రికేయులు అటుగా వెళ్లగా ఉదయం 9 గంటలకు తీయవలసిన వైద్యశాలను పాత్రికేయులు ఫోన్ చేసి పిలవడంతో స్వీపర్ కం స్కావెంజర్ (ఎఫ్ఎన్ఓ) అనంత 10.40 గంటలకు వైద్యశాలకు వచ్చి తాళాలు తీశారు. ఈ విషయంపై వైద్య అధికారిని ఎం అరుణశ్రీ వద్ద విలేకరులు ప్రస్తావించగా సోమ, బుధ, శుక్రవారాల మాత్రమే భీమాలి ఆయుర్వేద వైద్యశాలలో అందుబాటులో ఉంటానన్నారు. మిగిలిన రోజులు బోగాపురంలో ఉన్న ఆయుర్వేద వైద్యశాలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. సమయానికి తెరవని వైద్యశాల ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. సక్రమంగా విధులు నిర్వహించని వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రక్తహీనత నివారణకు పని చేస్తామని ప్రతిజ్ఞ

బొబ్బిలి: గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత నివారణకు పౌష్టికాహారాన్ని అందిస్తామని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ప్రతిజ్ఞ చేశారు. ఐసిడిఎస్ కార్యాలయంలో అర్బన్ అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం గురువారం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేసి రక్తహీనతను నివారిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు బాలమణి, అరుణకుమారి, కృష్ణవేణి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పాఠశాల పరిశీలన

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి పి. బాల భాస్కరరావు గురువారం పరిశీలించారు. తెలుగు, ఇంగ్లీషుకు సంబంధించిన వర్క్ బుక్స్‌ను పిల్లలతో చదివించారు. గణితంలో చతుర్విధ ప్రక్రియలు, చేసేల చేత టిఎల్ఎమ్‌ను ఉపయోగించి పదాలు తయారు చేయడం, ఎస్ఎంఎఫ్ వినియోగం, ఎండిఎం, సిలబస్ కంప్లీషన్ పరిశీలించారు. ఈ పరిశీలనలో ప్రధానోపాధ్యాయులతో పాటు సిబ్బందులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలు పరిశీలన

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీ విద్యర్ హైస్కూల్లో ఈ నెల 18 నుంచి ప్రారంభించనున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను గురువారం ఎంఈఓ బాలభాస్కరరావు గురువారం పరిశీలించారు. విద్యార్థులు పరీక్షలు రాసే బెంచులను, వెంటిలేషన్, తాగునీటి సౌకర్యం వంటి అంశాలపై ఆరా తీశారు.

వావిలపాడులో మహిళా వారోత్సవాలు

వేపాడ: మహిళా దినోత్సవ వారోత్సవాలు సందర్భంగా వావిలపాడులో సర్పంచ్ బీల రాజేశ్వరి అధ్యక్షతన గురువారం మహిళలకు సమావేశం నిర్వహించారు. ఎఎంసి చైర్‌పర్సన్ మాకల కస్తూరి, మండల మహిళ అధ్యక్షులు కర్రి యశోద, దొగ్గ సన్యాసి మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో మహిళా సాధికారత కోసం పాటు పడుతున్న జగనన్న ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలన్నారు. విశాఖ ఎంపిగా బొత్స ఝాన్సీలక్ష్మీని, ఎమ్మెల్యేగా కడుబండి శ్రీనివాసరావును ఓటు వేయాలన్నారు. ఈ సమావేశంలో జెసిఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, ఉప సర్పంచ్ గొర్రపోటు వెంకటలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు సిరిపురపు సుభద్రమ్మ, బీ సతీష్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులు ఒత్తిడిని జయించాలి

రేగిడి: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడిని జయించి పరీక్షలు ప్రశాంతంగా రాయాలని ప్యారి సుగర్స్ అసోసియేట్ సీనియర్ ఉపాధ్యక్షులు పట్టాభిరామిరెడ్డి అన్నారు. గురువారం దేవుడల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో చదువు తున్న పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, పరీక్ష అట్టలు, కంపాస్ బాక్సులు వంటి కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరుటకు తప్పనిసరిగా పది పాస్ కావాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమన్నారు. వీరితో సుగర్స్ హెడ్ మురళీ కృష్ణ, హెచ్ఆర్ హెడ్ కాటంనాయుడు, గాంధీ ఎమ్ఈఓ లక్ష్మి ఉన్నారు.

నాసిరకం పనులపై చర్యలు తీసుకోండి

బొబ్బిలి: పారాది వంతెన వద్ద డైవర్షన్ రోడ్డు పనులు నాసిరకంగా చేశారని, నాసిరకం పనులపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ డిమాండ్ చేశారు. పాడైపోయిన రోడ్డు పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో మూడు వారాలు కాకముందే రోడ్డు పాడైపోయిందన్నారు. నాణ్యత పాటించని కాంట్రాక్టర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పారాది, భోజరాజపురం, గొల్లాది వంతెనలు కలగా మిగిలిపోతున్నాయన్నారు. పారాది వంతెన నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భోజరాజపురం వంతెన నిర్మాణ పనులు ప్రారంభించి వదిలేశారని ఆరోపించారు. ఆయనతో సమాచార హక్కు చట్టం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సురేష్ ఉన్నారు.

టిడిపి జిల్లా నాయకత్వం బలహీనంగా ఉంది : పతివాడ

పూసపాటిరేగ: జిల్లా టిడిపి నాయకత్వం బలహీనంగా ఉందని టిడిపి రాష్ట్ర కార్యదర్శులు పతివాడ తమ్మునాయుడు, మహంతి చిన్నంనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. విజయనగరం ఎంపి టికెట్ బిజెపికి కేటాయిస్తారన్న నేపథ్యంలో మండలంలోని మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడు స్వగృహంలో ఆయన అధ్యక్షతన మండల టిడిపి సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ నెల్లిమర్ల టికెట్ జనసేనకు ఇస్తే కొంత ఇబ్బంది పడినా అధిష్టానం చెప్పిందని ఒప్పుకున్నామని ఇప్పుడు ఎంపి టికెట్ కూడా టిడిపికి లేదన్న వార్త జీర్ణించుకోలేక పోతున్నామన్నారు. చెవిలో పువ్వు చెవిలో గ్గాను పెట్టుకొని ప్రచారం చేయాలా అంటూ నాయకత్వాన్ని ప్రశ్నించారు. ఈ విషయాన్ని జిల్లా నాయకత్వానికి చెబుతామంటే వారి పరిస్థితి మనకంటా దారుణంగా ఉందన్నారు. అక్కడ కూడా గ్రూపులున్నాయన్నారు. ఇప్పటికైనా అధిష్టానం స్పందించి విజయనగరం ఎంపి టికెట్ మన నియోజకవర్గానికి చెందిన నాయకులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనసేనతో మనం వెళ్లాం కాని జనసేన నేతలంతా మన వెనుక ఉండాలని అలా అయితే సహకరిస్తామని చెప్పారు. ఎంపి టిక్కెట్టు టిడిపికి ఇవ్వాలని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరావు, నాయకులు విక్రం జగన్నాథం, పసుపులేటి గోపి, పిన్నింటి తిరుపతి, కెల్ల శ్రీను, ముత్యాల వెంకటరమణ, పతివాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పోస్టుల్లో అక్రమాలకు నిరసనగా

సిఎం దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద సీఎం జగన్ మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను గురువారం మాజీ మంత్రి, టిడిపి రాజాం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కొండ్రు మురళీమోహన్ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతలో పశువుల్ని అమ్మినట్లు సీఎం జగన్ మోహన్ రెడ్డి అండ్ కో ఉద్యోగాలను రేటు కట్టి ఎపి పిఎస్‌సి ఉద్యోగాలను అమ్ముకున్నారని విమర్శించారు. ఒక్కో డిప్యూటీ కలెక్టర్ పోస్టును రూ.2.50 కోట్లకు, ఒక్కో డిఎస్‌పి పోస్టును రూ. 1.50 కోట్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. 30 డిప్యూటీ కలెక్టర్ పోస్టులు, 25 డిఎస్‌పి పోస్టుల అక్రమంగా భర్తీ చేశారని తెలిపారు. మొత్తం రూ. 150 కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. గ్రూప్ -1 మెయిన్స్‌లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆ నోటిఫికేషన్ ద్వారా నియామకమై ప్రస్తుతం వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 162 మంది నియామకాలు చెల్లవని, మళ్లీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష నిర్వహించి 6 నెలల్లోపు నియామక ప్రక్రియ పూర్తి చేయాలని హైకోర్టు తీర్పునివ్వడంతో ఇది నిరూపితమైందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం 2018 డిసెంబర్ 31న 162 గ్రూప్-1 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసిందని, అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ప్రిలిమ్స్ ఎగ్జామ్ మే 27-2019, మెయిన్స్ ఎగ్జామ్



రేగిడి: సిఎం దిష్టిబొమ్మకు నిప్పు పెడుతున్న కొండ్రు

డిసెంబర్ 2022 నిర్వహించి వాటిలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిందన్నారు. సాంప్రదాయంగా అనుసరిస్తున్న మాన్యువల్ మూల్యాంకనం కాకుండా తమ వారికి ఉద్యోగాలు కట్టబెట్టేందుకు స్కాన్ చేసి మరీ డిజిటల్ వాల్యూయేషన్ చేశారన్నారు. ఎపిపిఎస్‌సి రూల్ నెం 3(9) ప్రకారం ఎట్టి పరిస్థితుల్లోనూ రెండోసారి వాల్యుయేషన్ చేయకూడదని రెండుసార్లు మూల్యాంకనం చేసి ముందు జరిగిన మూల్యాంకనం దాచిపెట్టి ఒకేసారి మూల్యాంకనం చేశామని ఎపిపిఎస్‌సి కోర్టుకు తప్పుడు అఫడవిట్ ఇవ్వటం వైసిపి ప్రభుత్వ బరితెగింపు కాదా? అని ప్రశ్నించారు. టిఎస్ పిఎస్‌సి గ్రూప్-1లో ఎపి లాగే కుంభకోణం జరిగితే దానికి బాధ్యులైన అధికారుల్ని తొలగించారని మరి నేటి కుంభకోణానికి బాధ్యులైన ఏపీపీఎస్సీ సెక్రటరీ పిఎస్ఆర్ ఆంజనేయులు, చైర్మన్ గౌతమ్ సవాంగ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగన్‌కు ఏమాత్రం నైతిక విలువలు, విశ్వసనీయత ఉన్నా తక్షణమే రాజీనామా చేయాలని కొండ్రు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్, దూబ ధర్మారావు, గేదెల బాలమురళి, గురవాన నారాయణ రావు, మంతిన ఉషారాణి, కర్నేన మహేష్, కెంబూరు ధనుంజయ, గురవాన రమేష్, మజ్జి శ్రీను, దువ్వపువలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కోట: తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులు, ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి ఏ విధంగా బుద్ధి చెప్పారో అదే రిజల్ట్ జగన్మోహన్ రెడ్డికి వస్తుందని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి అదితి గజపతిరాజు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2018 గ్రూప్-1 మెయిన్స్‌ను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తు, ఎపిపిఎస్‌సిలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ గురువారం పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లా నుండి ఆర్ అండ్ బి జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. ఈ సైకో పాలనలో అన్ని వ్యవస్థలను నాశనం చేస్తోందన్నారు. టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద నిరసన తెలిపారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

బాడంగి: రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా గురువారం పినపెంకి, వాడాడ గ్రామాల్లో బొబ్బిలి రూరల్ సిఐ ఎస్.తిరుమలరావు, స్థానిక ఎస్ఐ ఆర్.జయంతి ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని, అసాంఘిక శక్తులకు సహకరించవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

రోడ్డుపై చెత్త వేస్తే చర్యలు

బొబ్బిలి : రోడ్డుపై చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామ లక్ష్మి అన్నారు. పట్టణంలోని రావువారివీధి, నెయ్యిలవీధి, మంగళవీధి, గౌడవీధిల్లో పారిశుధ్య పనులను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త రోడ్లు, కాలువలు, ఖాళీ స్థలాల్లో వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. రోడ్లు, కాలువలు, ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలని కోరారు. శానిటేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.



విజేతలతో ఉపాధ్యాయులు

క్విజ్ పోటీల్లో ప్రతిభ

డెంకాడ: మహా సామ్రాజ్య పట్టాభిషేక ఉత్సవాలలో భాగంగా విజయనగరానికి చెందిన శ్రీనివాస సేవా సంఘం నిర్వహించిన రామాయణం క్విజ్ పోటీలలో రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పాఠశాలకు చెందిన దిండి అనుదీప్తి, ఆవాల లోకేష్, నామాల అనిత, ముని తేజస్వినిలు జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించారు. ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, లక్ష్మణరావు, సుధీర్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సౌభాగ్యలక్ష్మి, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శర్మ అభినందించారు.

నూరు శాతం హామీలు అమలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు శత శాతం అమలు చేసిందని మరోసారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చేయూత 4వ విడత చెక్కుల పంపిణీ మండల, నగర పంచాయతీ పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా 45 సంవత్సరాలు దాటిన డ్వాక్రా మహిళా సంఘాలకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు చేతుల మీదుగా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలు శత శాతం అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ ఛైర్మెన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి అంబళ్ళ సుధారాణి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ళ శ్రీరాముల నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు చనమళ్ల వెంకట రమణ, జడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠ నాయుడు, పతివాడ సత్యనారాయణ, నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ, పూసపాటిరేగ ఎఎంసి చైర్‌పర్సన్ చిక్కాల అరుణ కుమారి, వైసిపి పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబ



బొబ్బిలి: మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్‌పి, ఎమ్మెల్యేలు

శివరావు, వైస్ చైర్మన్‌లు సముద్రపు రామారావు, కారు కొండ కృష్ణ, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాస రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: అవినీతి రహిత పాలన జగనన్నతోనే సాధ్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్ఆర్ చేయూత 4వ విడత ఆర్థిక సహాయం నిధులు విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ మన ప్రభుత్వం ఎన్నో రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, స్కూల్ పిల్లల దగ్గరి నుంచి సీనియర్ సిటిజెన్స్ వరకు ఇలా ఒక్కో వర్గానికి ఒక్కో విధమైన పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని గుర్తు చేశారు. అనంతరం మహిళలకు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపిలు ఇందుకూరి సుధారాజు, పినిశెట్టి వెంకటరమణ, ఎస్.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సంతోషికుమారి, జిసిసి చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మహిళలకు వైసిపి ప్రభుత్వం చేయూతనిస్తుందని ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో గురువారం వైఎస్ఆర్ చేయూత పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చేయూత అమలు చేస్తుందన్నారు. మహిళలు సంక్షేమానికి పని చేస్తున్న వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, ఎపిఎంలు, మెప్మా ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు

పలుచోట్ల జనసేన ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - కొత్తవలస

పట్టణ కేంద్రంలో జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ ఒబ్బిన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆ పార్టీ 11వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ పాల్గొని జనసేన నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. మెడికవర్ హాస్పటల్ సహకా రంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్ని పేద ప్రజలకి మందులు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, నాయకులు కనకాల శివ, కొట్యాడ రమణమూర్తి, కరెడ్ల ఈశ్వరరావు, పాల్గొన్నారు.

బొబ్బిలి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు జన సైనికులు పని చేయాలని నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి కోరారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో గురువారం జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి జనసేన జెండాను ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టారు. వీర మహిళలకు చీరలు, మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పి.మనోజ్ కుమార్, పాల్గొన్నారు.

విజయనగరం: జనసేన కార్యకర్తలంతా ఎన్నికల సంగ్రామానికి సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ నాయకులు గురాన అయ్యలు అన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జనసేన నేత గురాన అయ్యలు కార్యాలయంలో గురువారం నిర్వహించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు ఆదాడ మోహన్ రావు, పాల్గొన్నారు.

డెంకాడ: జనసేనతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి లోకం మాధవి అన్నారు. జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆమె ఆధ్వర్యంలో నాతవలస నుంచి డెంకాడ వరకూ బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం డెంకాడలో సభ నిర్వహించి మాట్లాడారు. యశశ్విని, పి.అరుణ పాల్గొన్నారు.

అక్రమ బదిలీలను నిలిపివేయాలి

బొబ్బిలి: కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ ప్రభుత్వం అక్రమంగా, అడ్డుగులోగా చేస్తున్న ఉపాధ్యాయ బదిలీలను తక్షణమే నిలుపుదల చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్నో ఐక్య పోరాటాల ద్వారా కౌన్సెలింగ్ విధానాన్ని సాధించుకున్నామని దానికి తిలోద కాలిస్తూ అన్ని జిల్లాలలో సుమారుగా 1400 ఉపాధ్యాయులను నగదు, సిఫార్స్ బదిలీలు నిర్వహించేలా ప్రభుత్వం అనైతిక చర్యలకు పాల్పడటం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యా సంవత్సరం ముగుస్తున్న ఈ సమయంలో గుట్టు చప్పుడు కాకుండా ప్రభుత్వం ఇలాంటి బదిలీలను నిర్వహించటం ప్రభుత్వం తన విశ్వసనీయతను కోల్పోవటమేనని అన్నారు.

'అన్యాయం చేస్తే సహించం'

బొబ్బిలి: రాజకీయ పదవులలో కొప్పల వెలమలకు అన్యాయం చేస్తే సహించేది లేదని కొప్పల వెలమ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బి.తిరుపతినాయుడు, బొబ్బిలి తాలూక అధ్యక్షులు కర్రి సత్యనా రాయణ, కోశాధికారి ఎం.కృష్ణమూర్తినాయుడు అన్నారు. రాజకీయ పదవులలో కొప్పల వెలమలకు ప్రాధాన్యత ఇవ్వాలని పట్టణంలో గురువారం మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 35లక్షల మంది కొప్పల వెలమలు ఉంటే రాజకీయ పదవులలో ప్రధాన పార్టీలు అన్యాయం చేస్తున్నా యన్నారు. విజయనగరం ఎమ్‌పి సీటు కొప్పలవెలమలకు ఇవ్వాల న్నారు. జనాభా ప్రాతిపదికన కొప్పల వెలమలకు ఎమ్‌పి, ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వకపోతే పోరాటం చేస్తామన్నారు. **విజయనగరం టౌన్:** ఎంపి టిక్కెట్ కొప్పలవెలమలకు ఇవ్వాలని, లేదంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేసి తమ శక్తి ఏమిటో రాజకీయ పార్టీలకు చూపిస్తామని కొప్పలవెలమ సంఘం జిల్లా నాయకులు బొత్స వర ప్రసాద్, కోశాధికారి యాంద్రాపు తాతబాబు, ఉపాధ్యక్షులు పెంట స్వామి నాయుడు తెలిపారు. గురువారం వెలమ సంక్షేమ సంఘం భవనంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమను పార్టీలు గుర్తించకపోతే స్వతంత్రంగా పోటీ చేస్తామని తెలిపారు.

మంచినీటి సరఫరా బంద్ చేస్తాం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం, ముసిడిపల్లి పంప్ హౌస్ కార్మికులకు ఆరు నుంచి 8 నెలల జీతాలు బకాయిలు ఉన్నాయని, సోమవారం లోగా చెల్లించకపోతే మంగళవారం అర్ధరాత్రి నుంచి మంచినీటి సరఫరా నిలిపివేస్తామని యూనియన్ నాయకులు ఏ. జగన్మోహన్‌రావు, మురళి, అరుణ్‌లు హెచ్చరించారు. గురువారం ఉదయం నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్ వద్ద జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. శుక్రవారం నల్ల రిబ్బన్లతో విధులకు హాజరవుతామని, శనివారం మేయర్, ప్రజాప్రతినిధులు కలుస్తామని, సోమవారం మున్సిపల్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహిస్తామని ప్రకటించారు. అప్పటికీ జీతాలు చెల్లించకపోతే మంగళవారం అర్ధరాత్రి నుంచి మంచినీటి సరఫరా నిలుపుదల చేస్తామని, ప్రజలకు జరిగే ఈ అసౌకర్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నారాయణరావు, రాంబాబు, రమేష్, శ్రీను, కృష్ణ, గోవిందు, స్వామి, సత్యనారాయణ, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

'ఆడుదాం ఆంధ్ర' క్రీడాకారులకు నిరాశ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర తరుపున ఆడి గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతి ఇవ్వకపో వడంతో నిరాశ చెందుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో క్రీడాకారులను ప్రోత్సహిం చాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వివిధ క్రీడలలో గెలుపొందిన క్రీడాకారులకు మొదటి, రెండు, మూడవ బహుమ తులుగా నగదును ప్రకటించారు. మొదట పంచాయతీల వారీగా ఎంపిక చేసి నియోజకవర్గస్థాయిలో ఆడించారు. లక్కవరపుకోట మండలం నుండి (ఎల్ కోట పంచాయతీ) మహిళల కబడ్డీ జట్టు నియోజకవర్గ స్థాయిలో రెండవ స్థానంలో నిలిచింది. వీరికి రావలసిన రూ. 15వేలు ప్రోత్సాహం నగదును ఇంతవరకు ఇవ్వలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్ర తరపున క్రీడలలో పాల్గొని గెలుపొందిన క్రీడాకారులందరికి ప్రోత్సాహక నగదును అందజేసి ఇక్కడ గెలుపొందిన వారికి రాకపోవడంతో క్రీడాకారులు కే జయమ్మ, జె సత్య, జే రామలక్ష్మి, ఎస్ రూప, కే ధనలక్ష్మి, పి సమీర, పి దివ్య తదితరులు అసహనానికి గురవు తున్నారు. ఎన్నికల కోడ్ సమీపించక ముందే త్వరతిగతిన నగదు బహుమతి ఇవ్వాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఆడనివారి పేర్లు కుడా కంప్యూటర్‌లో జనరేట్ చేసినట్లు విశ్వసియమైన సమాచారం. ఈ విషయంపై ఎల్ కోట పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా గెలుపొందిన క్రీడాకారులకు సంబంధించి బ్యాంకు వివరాలతో సహా కంప్యూటర్‌లో జనరేట్ చేశామని స్పష్టం చేశారు.



ప్రోత్సాహక నగదు ఇవ్వలేదని చెబుతున్న క్రీడాకారులు

సమస్యలపై సిఐటియు నిరసన

ప్రజాశక్తి - లక్కవరపుకోట

దీర్ఘకాలంగా వెంటాడుతున్న కార్మికుల సమస్యలపై మండల కేంద్రంలో గల గాంధీ బొమ్మ జంక్షన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం, ఆశా కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు గాడి అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్లో రూ. 2 లక్షల కోట్లు కేటాయించి 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేసి కడప ఉక్కును ప్రభుత్వ రంగంలోనే నిర్మించాలన్నారు. రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా సమగ్ర పంటల భీమా పథకం పెట్టి, సిసిఆర్ చట్టాన్ని సవరించి కౌలు రైతులకు నష్టపరిహారాలు, బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల శాఖ అధ్యక్షులు తరిణి వెంకటరమణ, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

కంటిచూపు కోల్పోతే జీవితం దుర్భరం

ప్రజాశక్తి-విజయనగరం కోట

కంటి చూపును కోల్పోతే జీవితం దుర్భరమవుతుందని పట్టణానికి చెందిన నేత్రవైద్య నిపుణులు డాక్టర్ విష్ణు వర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం పట్టణంలోని వెంకటరమణ ఆసుపత్రిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ విష్ణు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం సరిగా లేకుండా జీవితంలో ఏ విషయంలోనూ ప్రగతి సాధించ లేమన్నారు. ముఖ్యంగా వయోజనులు కంటి సమస్యల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. తలనొప్పి రావడం, పుస్తకాలను చదివేటపుడు కళ్ల వెంట నీరు రావడం వంటి పరిస్థితులను గుర్తించినపుడు నేత్ర వైద్య నిపుణులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. ప్రతిరోజూ తీసుకున్న ఆహారంలో విటమిన్ 'ఎ' ఉండే పదార్థాలను విధిగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సుమారు 86 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, 28 మందిని కేటరాక్ట్ పరీక్షలకు ఎంపిక చేసినట్లు ఆసుపత్రి ఎఒ బాజ్జీ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ తనూజ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొనసాగుతున్న మిమ్స్ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరశన సమ్మె గురువారం కొనసాగింది. స్థానిక ఆర్‌ఒబి వద్ద చేపడుతున్న సమ్మె శిబిరం 43వ రోజుకి చేరుకుంది. శిబిరానికి మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏ. జగన్ మోహన్ రావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి. రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేశ్ మాట్లాడుతూ గత 43రోజులుగా మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు జనవరి నెల జీతాలు డి ఎ బకాయిల, వేతన ఒప్పందం చేయాలని నిరశన సమ్మె చేస్తుంటే యాజమాన్యం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు. పని చేసిన కాలానికి జనవరి నెల జీతాలు మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఇవ్వక పోవడం అన్యాయ మన్నారు. ప్రభుత్వం, మిమ్స్ యాజమాన్యం స్పందించి న్యాయమైన సమస్యలు పరిష్కరించి జనవరి నెల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు, ఉద్యోగులు ఎం.నారాయణ, కె. కామునాయుడు, కె.మధు, గౌరి, మూర్తి, ఎం. నాగభూషణం, బెల్లాన బంగారునాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.సురేష్